నవమి ఉత్సవాలకు సిద్ధం

- భాస్కర క్షేత్రంలో 6 నుంచి ఉత్సవాలు
- 14న సీతారామ కల్యాణోత్సవం

తాడిపత్రి రూరల్: పట్టణంలోని ఏటిగడ్డ పాలెంలో భాస్కర క్షేత్రంగా వ్యాసరాజులచే దాదాపు 700 సంవత్సరాల క్రితం ప్రతిష్ఠించిన ఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల న శ్రీరామనవమిని పురస్కరించుకుని నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సీతారాములు వివిధ అలంకరణలతో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆలయంలో రోజూ 10 వేల సార్లు రామ తారక మంత్రంతో హోమం నిర్వహించనున్నారు. ఈ నెల 6న శ్రీరామ నవమిని పురస్కరించుకు సీతారామస్వామికి ఉదయం ప్రత్యేక పూజలు, సాయంత్రం పానకం, పన్నేరం పంపిణీ చేయనున్నారు. సాయంత్రం బాలాంజనేయుల అలంకరణ, 7న కౌసల్యరామ అలంకరణ, 8న విశ్వామిత్ర అలంకరణ, 9న తాటకి సంహార అలంకరణ, 10న హోమ రక్షణ అలంకరణ, 11న దశ భుజ రామచంద్రస్వామి అలంకరణ, 12న వైకుంఠరామ అలంకరణ, 13న సీతా స్వయంవర అలంకరణ, 14 సీతారామస్వామి కలాణోత్సం, సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి గ్రామోత్సవం నిర్వహించనున్నారు.



ఆంజనేయస్వామి దేవాలయం



దేవాలయం ఎదుట
20 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం

ఆలయ చరిత్ర

శ్రీకృష్ణదేవరాయలుకు ఉన్నటువంటి కుహూ యోగం వల్ల వచ్చిన మరణ గండాన్ని తన తపః శక్తితో కాపాడి వ్యాసరాజులుగా ప్రఖ్యాతి గాంచి కర్ణాటక సింహాసనాన్ని అధిష్టించి కర్ణాటక సింహాసనాదీశ్వర బిరుదును పొందారు. ఆయన దేశ పర్యటన చేస్తూ కసాపురం, నేమకల్లు, మురిడి, హంపి, చక్రతీర్థం, బీచుపల్లి తదితర 1,008 పైగా ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్టించారు. ఇందులో భాగంగా తాడిపత్రి ప్రాంతానికి వచ్చిన వ్యాసరాజులు నిద్రలో కనిపించిన ఆంజనేయస్వామి విగ్రహం కోసం గాలించి చివరికి పెన్నానది తీరంలో శిలపై వెలసిన ఆంజనేయ స్వామిని ఏటిగడ్డ పాలెంలో దేవాలయాన్ని నిర్మించి ప్రతిష్టించారు. అదే రోజు మూడు రూపాల్లో ఉన్న ఆంజనేయస్వామిని ప్రతిష్టించారు. దేవాలయంలో ప్రస్తుతం స్వామివారు బాల, కౌమార,యవ్వన రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. కాగా ఏటిగడ్డ ఆంజనేయస్వామి దేవాలయాన్ని 2012లో కమిటీ సభ్యులు రూ.కోటితో జీర్ణోద్ధరణ పనులు చేశారు. దేవాలయాన్ని విస్తరించడంతో పాటు వివిధ రకాల శిల్ప కళాకృతులతో అధునిక శైలిలో నిర్మాణ పనుల కోసం భక్తుల విరాళాలతో 2012లో ప్రారంభించి 2015లో పూర్తి చేశారు.



ఆంజనేయస్వామి మూలవిరాట్

భక్తుల సహకారంతో ఏర్పాట్లు



ఏటిగడ్డ ఆంజనేయ స్వామి దేవాలయంలో వైభవంగా నవ రాత్రి ఉత్సవాలను నిర్వహిస్తాం. ఉత్సవాల్లో బాగంగా సీతారామస్వామి విధ రకాల అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉత్సవాల కోసం భక్తుల సహకారంతో ఏర్పాటు చేస్తున్నాం.

– శ్రీ వాత్సవ,
ప్రధాన అర్చకుడు

'సూపర్ సిక్స్' పథకాలను అమలు చేయాలి

గుంతకల్లు రూరల్: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం వెంటనే సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలని కోరుతూ అఖిల భారత రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణ, జిల్లా కమిటీ సభ్యుడు రామాంజనేయులు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు బీజేపీ, టీడీపీ, జనసేన సూపర్‌సిక్స్ పథకాలను హామీగా చూపి ప్రజలతో ఓట్లు వేయించుకున్నారని, అధికారం చేతికి వచ్చాక హామీల అమలును ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇస్తామని ఆశచూపిన కూటమి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడంతో రైతన్నలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కూడా కల్పించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లికి వందనం పథకాన్ని అమలు చేయకపోవడంతో పిల్లల చదువుకోసం తల్లిదండ్రులు నానాకష్టాలు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలని, అలాగే నిరుపేదలకు వెంటనే ఇళ్ల స్థలాలు మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అఖిల భారత రైతు కూలి సంఘం నాయకులు

సమాచార ఉద్యమ కారులకు రక్షణ కల్పించాలి

సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం కోరుతున్న వారిపై బెదిరింపులు, దాడులు రోజురోజుకూ పెరిగిపోతున్న తరుణంలో సమాచార ఉద్యమ కారులకు రక్షణ కల్పించాలని కోరుతూ గురువారం గ్రామీణ పౌరసమాజం ఆధ్వర్యంలో తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సభ్యుడు లాలిరెడ్డి మాట్లాడుతూ అవినీతి అక్రమలను అరికట్టడంతో పాటు, ప్రజలకు పారదర్శక పాలన, అధికారుల్లో జవాబుదారీతనం ఉండాలన్న మహోన్నత లక్ష్యంతో 2005లో సమాచార హక్కు చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చారన్నారు. కానీ రాజకీయ పలుకుబడితో సమాచారం కోరిన వారిపై బెదిరింపులు, దాడులకు పాల్పడటం వంటి ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

పెద్దవడుగూరు: తాడిపత్రి నియోజక వర్గంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మేడిమాకులపల్లి, లక్ష్మంపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. మేడిమాకులపల్లిలో జెడ్పీ మాజీ సభ్యుడు చితంబరరెడ్డి నివాసంలో కార్యకర్తలతో మాట్లాడారు. గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు చేస్తున్న అక్రమాలను గురించి అడిగి తెలుసుకున్నారు. అనధికారికంగా చేస్తున్న పను గురించి వివరాలు సేకరించాలని సూచించారు. గ్రామాల్లోని ప్రతి కార్యకార్తా ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. అనంతరం లక్ష్మంపల్లిలో ఇటీవల రైతు పుట్లూరు పుల్లారెడ్డికి చెందిన వ్యవసాయ సామగ్రి, పైపులకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో రూ.లక్షల విలువ చేసే సామగ్రి కాలిపోయింది. విషయం తెలుసుకున్న పెద్దారెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. అన్నివిధాలా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు గూడూరు సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి, పాశంరంగస్వామి, శేషారెడ్డి, రామచంద్రారెడ్డి, చిన్నవడుగూరు సర్పంచ్ రమణారెడ్డి, ఆర్‌టీఐ నియోజవర్గ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షుడు మధన్‌మోహన్‌రెడ్డి, చిట్టూరు నాగభూషణ, మండల నూతన ఉపాధ్యక్షుడు మహేష్‌రెడ్డి, నాగిరెడ్డి, మండల కార్యదర్శి గోపీనాథరెడ్డి, కండ్లగూడూరు ఈశ్వరయ్య, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.



లక్ష్మంపల్లిలో పర్యటిస్తున్న తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

రైతు సమస్యలు పరిష్కరించండి

గుత్తి రూరల్: రైతు సమస్యలను పరిష్కరించి, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణ, నాయకుడు రాజశేఖర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సమస్యల పరిష్కారం కోసం గురువారం ఏఐకేఎంఎస్ నాయకులు ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల మేరకు అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు రూ.20 వేలు వెంటనే చెల్లించాలన్నారు. కౌలు రైతుల రక్షణ, సంక్షేమం కోసం తక్షణమే సమగ్ర కౌలు చట్టాన్ని చేయాలన్నారు. హంద్రీ–నీవా లైనింగ్ పనుల కోసం విడుదల చేసిన జీఓలు 404, 405 వెంటనే రద్దు చేసి, లైనింగ్ పనులు ఆపాలన్నారు. హంద్రీ–నీవా కాలువ సామర్థ్యాన్ని 10 వేల క్యూసెక్కులకు పెంచాలన్నారు. హెచ్ఎల్‌సీకి సమాంతర కాలువ నిర్మించాలన్నారు. ఇళ్లు లేని నిరుపేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాలలో రెండు సెంట్ల భూమి ఇస్తామన్న హామీని వెంటనే అమలు చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలని తహసీల్దార్ ఓబిలేసుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు శ్రావణి, దస్తగిరమ్మ, లక్ష్మి, షమీనాబేగం, ప్రహ్లాద, రాజు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించండి

తాడిపత్రిటౌన్: పట్టణంలో అస్తవ్యస్తంగా వున్న ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని సీఐ సాయిప్రసాద్‌కు ఏఎస్పీ రోహిత్‌కుమార్ సూచించారు. తాడిపత్రి పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో గురువారం మీమాటే ముఖ్యం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ పట్టణ ప్రధాన కూడళ్లు, టీ దుకాణాలు, సినిమా థియేటర్‌ల వద్ద ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలన్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడపరాదన్నారు. అలాగే మట్కా, పేకాట కేంద్రాలపై దాడులు చేసి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. క్రికెట్ బెట్టింగ్, గంజాయి రవాణాపై నిఘా ఉంచాలన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 15 రోజులకు ఒక్కసారి రౌడీషీటర్‌లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. వారిపై నిఘా ఉంచుతామన్నారు. రానున్న రోజుల్లో తాడిపత్రి నియోజకవర్గంలోని ప్రతి పల్లెలో పర్యటించి ఫ్యాక్షన్ నివారణ చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే బాల్య వివాహాలు, బాలకార్మికుల వ్యవస్థ రూపుమాపేందుకు విరివిగా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. మీమాటే ముఖ్యం కార్యక్రమంలో భాగంగా ప్రతి మండలంలో పోలీస్ ఫిర్యాదుల బాక్స్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. మీ మాటే ముఖ్యం కార్యక్రమంలో నాలుగు అర్జీలు వచ్చాయని, వాటిని త్వరలో పరిష్కరిస్తామన్నారు.



సీఐతో మాట్లాడుతున్న ఏఎస్పీ రోహిత్‌కుమార్

గార్లదిన్నెలో భారీ వర్షం

గార్లదిన్నె/శింగనమల/తాడిపత్రి రూరల్/తాడిపత్రిటౌన్/పామిడి/యల్లనూరు/: గార్లదిన్నె మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లు, ఇళ్ల ముందర వర్షం నీటితో నిండిపోయాయి. వర్షం కారణంగా విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. అలాగే వర్షంలో వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఎండలు తీవ్రత వల్ల పగలంతా ఉక్కపోతతో ఇబ్బంది పడిన జనం వర్షం రాకతో ఉపశమనం పొందారు. అలాగే శింగనమల, తాడిపత్రి, పామిడి, యల్లనూరు మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. శింగనమలలో రోడ్ల మీద అడుగు మేర వర్షం నీరు పారాయి. శింగనమలలో చిన్న చిన్న వడగళ్లు పడ్డాయి.



శింగనమలలో రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు

సంక్షిప్త వార్తలు

ముగిసిన అథ్లెటిక్స్ పోటీలు

గుత్తి: పట్టణంలోని గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో వారం రోజులుగా జరుగుతున్న అథ్లెటిక్స్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ పోటీలు గురువారం ముగిశాయి. కాలేజీ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థినీ, విద్యార్థులకు స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌తో పాటు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. శుక్రవారం కాలేజీ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఎండీ రఘునాథ్‌రెడ్డి తెలిపారు.

గడ్డి వామి దగ్ధం

గార్లదిన్నె: మండల కేంద్రంలో గురువారం అగ్ని ప్రమాదంలో గడ్డివాము దగ్ధమైన సంఘటన చోటు చేసుకుంది. స్థానికుల వివరాలు మేరకు ... గ్రామానికి చెందిన క్రిష్ణమనాయుడు అనే వ్యక్తి పశువుల కోసం వ్యవసాయ దొడ్డిలో వరి గడ్డి వామి వేయగా ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరగడంతో స్థానికులు గమనించి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అలాగే ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పేశారు. మంటల్లో దాదాపు 3 ట్రాక్టర్ల వరి గడ్డి కాలిపోయింది. దాదాపు రూ. 20 వేలు జరిగినట్లు బాధిత రైతు వాపోయాడు.

మడ్డిపల్లిలో వరుస కేబుల్ చోరీలు

పుట్లూరు: మండలంలోని మడ్డిపల్లిలో వరుస కేబుల్ చోరీలు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. గత వారం రోజుల్లో 14 మంది రైతుల బోరుబావుల వద్ద కేబుల్ వైర్లు చోరీలకు గురయ్యాయి. బుధవారం రాత్రి మరో నాలుగు బోరుబావుల వద్ద కేబుల్ వైర్లను చోరీ చేసినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాత్రి సమయాల్లో రోడ్డు సమీపంలో ఉన్న తోటల్లో ఎక్కువగా చోరీలు జరుగుతున్నట్లు రైతులు వాపోతున్నారు. పోలీసులు దొంగలను పట్టుకోవాలని కోరుతున్నారు.

రేషన్‌షాపులో విజిలెన్స్ అధికారుల తనిఖీ

పుట్లూరు: మండలంలోని గోపురాజుపల్లి రేషన్‌షాపులో గురువారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. షాపులో రిజిస్టర్లను పరిశీలించి నిల్వలపై ఆరా తీశారు. తనిఖీల్లో రెండు ప్యాకెట్లు (2 కిలోలు) కంది బేడలు అధికంగా ఉన్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు.

యువకుడి అదృశ్యం



సీతారాముడు (ఫైల్)

గుంతకల్లు రూరల్: గుంతకల్లు పట్టణ శివారులోని జానకమ్మ హోటల్ వెనక భాగాన నివాసం ఉంటున్న సీతారాముడు అనే యువకుడు గత ఐదు రోజులుగా కనిపించడం లేదని గురువారం సాయంత్రం యువకుడి తల్లి రాధమ్మ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. రాధమ్మ, రామాంజనేయులు దంపతులు కుమారుడైన సీతారాముడు లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ తాడిపత్రిలో ఉంటున్నాడు. ఇతడు తరచూ ఇంటికి వచ్చి వెళ్లేవాడు. ఈ క్రమంలో మార్చి 10న ఇంటి నుంచి పనికి బయలుదేరిన సీతారాముడు క్రమం తప్పకుండా ఇంటికి ఫోన్‌చేసేవాడు. ఐదు రోజులుగా అతడు ఫోన్ చేయకపోవడం, అతడి ఫోన్‌కూడా స్విచ్ ఆఫ్ వస్తుండటంతో తల్లిదండ్రులు అతడి ఆచూకీకోసం పనిచేసే చోట, బంధువులకు ఫోన్ చేసి విచారించారు. ఎంతకూ సీతారాముడు ఆచూకీ లభ్యం కాకపోవడంతో గురువారం సాయంత్రం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గుత్తి రూరల్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి మండలంలోని సర్పంచ్, ఎంపీటీసీలు, కో–ఆప్షన్ సభ్యులు, జెడ్పీటీసీ, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని వారు కోరారు. అధికారులు గడిచిన మూడు నెలల ప్రగతి నివేదికలు వెంట తీసుకురావాలన్నారు.

'కీచక ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోండి'

గుత్తి: విశాఖ పట్టణంలోని మధురవాడలో ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏడేళ్ల బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన కీచక ఉపాధ్యాయుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ నాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని మోడల్ స్కూల్లో విద్యార్థులతో కలిసి ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పాలనలో మహిళలు, బాలికలు, విద్యార్థులు, చిన్నారులపై హత్యలు, అత్యాచారాలు, వేధింపులు అధికమయ్యాయన్నారు. ఏడేళ్ల బాలికపై అసభ్యంగా ప్రవర్తించినా, ఇంతవరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే కీచక ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అంత్యక్రియలకు తరలిస్తున్న ఆ నలుగురు సేవాసమితి సభ్యులు

గుంతకల్లుటౌన్: పాతబస్టాండ్ సమీపంలోని చింతచెట్టు వద్ద మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహానికి ఆ నలుగురు సేవాసమితి సభ్యులు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటారు. గురువారం టూటౌన్ పోలీసుల విజ్ఞప్తి మేరకు మృతదేహాన్ని పాత గుంతకల్లులోకి హిందూ శ్మశాన వాటికకు తరలించి అంతిమ సంస్కారాలు నిర్వహించినట్లు ఆ సమితి అధ్యక్షుడు మంజుల వెంకటేష్ తెలిపారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు రవీంద్ర, సభ్యులు లింగేష్, రత్నమ్మ, ఈరమ్మ, అంజి, టూటౌన్ కానిస్టేబుళ్లు వీరాంజినేయులు, ఓబులేసు పాల్గొన్నారు.

ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

యల్లనూరు: మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో ఆరో తరగతి, ఇంటర్ ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం ఎంఈఓ మాట్లాడుతూ బడిఈడు, బడిబయట, అనాథ విద్యార్థులు అర్హులన్నారు.

పైప్‌లైన్ ఏర్పాటుకు పూజ



పూజ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ నుంచి గుంతబావి మీదుగా మండీబజార్ మున్సిపల్ వాటర్ ట్యాంక్‌కు నీటిని సరఫరా చేసే పంపింగ్ మెయిన్ పైప్‌లైన్ ఏర్పాటు పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని పూజలు చేశారు. రూ.90 లక్షల వ్యయంతో పైప్‌లైన్ ఏర్పాటు చేయనున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. భవిష్యత్‌లో చేపట్టనున్న డీఎంఎం రైల్వే గేట్ అండర్ పాస్ బ్రిడ్జి పనుల నేపథ్యంలో పాత పంపింగ్ పైప్‌లైన్ షిఫ్ట్ చేసి కొత్త పైప్‌లైన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు ఏఈ సుదర్శన్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్, కౌన్సిలర్ కృపాకర్, టీడీపీ నాయకుడు నారాయణస్వామి, ఎంఈ లీలాకృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీ మండల కమిటీ నియామకం

తాడిపత్రి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తాడిపత్రి మండల కమిటీ నియామకం బుధవారం జరిగింది. మండల అధ్యక్షుడిగా టి. ప్రభాకర్, వైస్ ప్రెసిడెంట్‌గా కె. శ్రీనివాసులరెడ్డి, జనరల్ సెక్రటరీలుగా కె. శ్రీనివాసులు, ఎల్.మోహన్‌నాయుడు, కె.మోహన్‌రెడ్డి, ఎం. కాశీవిశ్వనాథ్, సెక్రటరీ సి. చంద్రశేఖర్‌రెడ్డి, బి. నాగరాజు, బి. ఆదిశేషయ్య నియామకమయ్యారు.

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

తాడిపత్రి: పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు తాడిపత్రి రూరల్ పరిధిలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణను అందజేస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం. హరిబాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 2 నుంచి ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయన్నారు. ఈ నెల 30న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఉన్న దృష్ట్యా కళాశాలకు చెందిన అధ్యాపకులచే శిక్షణ ఇస్తూ, విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేస్తామన్నారు. అలాగే పాలీసెట్ ప్రవేశ పరీక్షకు విద్యార్థులు కళాశాలలోనే ఉచితంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించామన్నారు. ఇందుకుగాను ఓసీ, బీసీ విద్యార్థులకు రూ. 400, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు రూ.100 ఫీజు ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో చెల్లించాలన్నారు. మరింత సమాచారం కోసం 7901620198, 9989160103 నంబర్లను సంప్రదించాలన్నారు.

మహిళా కార్మికులకు చీరల పంపిణీ



సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పామిడి: పామిడిలో సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం పంచాయతీ, ఆలయాల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఆ సమితి అధ్యక్షుడు కే విశ్వనాథ్ రాజేశ్వరి దంపతుల సౌజన్యంతో 39 మంది మహిళలకు వస్త్ర దానం నిర్వహించారు. సత్యసాయి బాబా చూపిన మార్గంలో పేదలకు తమ వంతుగా సాయం చేయాలన్న సంకల్పంతోనే వస్త్రదానం చేపట్టామని విశ్వనాథ్ దంపతులు తెలిపారు.

బాట సుంకులమ్మ ఆలయంలో పూజలు



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దంపతులు

గుత్తి రూరల్: మండలంలోని బాచుపల్లిలో ఉన్న బాట సుంకులమ్మ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి, సతీమణి శారదమ్మ గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యేకు అర్చకులు, స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేసి అమ్మవారిపై ఉంచిన వస్త్రాలను, తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే దంపతులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్ నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణమోహన్‌నాయుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సర్వేలు వేగవంతం చేయండి



సచివాలయ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్

గుత్తి రూరల్: ప్రభుత్వం నిర్దేశించిన పీ4, వర్క్ ఫ్రం హోమ్, సిటిజన్ సర్వే, ఇంటింటి సర్వేలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ ఆదేశించారు. మండలంలోని తురకపల్లి సచివాలయాన్ని గురువారం ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. వెక్టర్ కంట్రోల్ యాప్ ఉపయోగాల గురించి వివరించారు. సచివాలయ ఉద్యోగులు రోజూ 9.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ తప్పకుండా విధుల్లో ఉండాలని సూచించారు. సర్వేలకు వెళ్లే సమయంలో రికార్డులో నమోదు చేసి వెళ్లాలన్నారు. అనంతరం గ్రామ శివారులోని వర్మీ కంపోస్టు ఎరువు తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి ఎరువు తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు మానస, శిరీష పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు



ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న శనగలగూడూరు గ్రామస్తులు

పుట్లూరు: మండలంలోని శనగలగూడూరు గ్రామ పంచాయతీ కార్యదర్శిపై గ్రామస్తులు గురువారం ఎంపీడీఓ అలివేలమ్మకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి జనన, మరణ ధ్రువీకరణ పత్రాల మంజూరు సమయంలో అవినీతికి పాల్పడుతున్నారని, డబ్బు వసూలు చేస్తూ పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. అవినీతిపై ప్రశ్నిస్తే 'మీ ఇష్టం వచ్చిన వారికి చెప్పుకోండి.. ఉన్నతాధికారులు తనపై చర్యలు తీసుకోలేరు' అంటున్నారన్నారు. వెంటనే పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

అప్రమత్తంగా ఉండండి

పామిడి: అకాల వర్షం కురుస్తున్న నేపథ్యంలో రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎస్.శ్రీధరమూర్తి గురువారం సూచించారు. ఉరుములు, మెరుపులు, ఈదరు గాలులతో కూడిన వర్షాలు పడే ఆస్కారం ఉన్నందుకు ప్రజా సంక్షమంపై ఎప్పటికప్పుడు సమాచారం అందించి సహకరించాలన్నారు. ఉరుములు, మెరుపులకు టీవీ, ఫ్రిజ్, ఏసీల వంటి వాటికి నష్టం వాటిల్లకుండా ప్రజలు జాగ్రత్త వహించాలన్నారు. చెట్లు, ఇతరత్రా మైదాన ప్రాంతాల వద్దకు వెళ్లకుండా ఇళ్లలోనే ఉండి పిడుగుల నుంచి రక్షణ పొందాలన్నారు.